క్లుప్తంగా

ఏకలవ్య ఎంట్రన్స్ పరీక్షకు 18 మంది గైర్హాజరు

సీతంపేట: భామిని, మెళియాపుట్టిలలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరోతరగతిలో ప్రవేశానికి స్థానిక ఏపీఆర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఎంట్రన్స్‌టెస్ట్‌లో మొత్తం 349 మంది విద్యార్థులకు గాను బాలురు 186, బాలికలు 145 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ అరుణ్‌జ్యోతి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ నీలంనాయుడు, అబ్జర్వర్ జి.గంగాదేవిలు పర్యవేక్షించారు.

హక్కుల పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినులతో కేక్ కట్‌చేయిస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: బాలికలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోంద ని, వాటిపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉం డా లని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి అన్నా రు. ఈ మేరకు ఆదివారం ఆమె మండలంలోని కవిటిభద్ర కేజీబీవీలో నిర్వహించిన మహిళా దినో త్సవ వారోత్సవాల్లో పాల్గొన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పాఠశాలలో కేక్‌ను విద్యార్థినులతో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల రక్షణ కోసం డయల్ 100ను పోలీస్‌శాఖ అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. విద్యార్థినులకు ఎక్కడైనా ఇబ్బందులు కలిగితే తక్షణం 100కు ఫోన్ చేస్తే క్షణాల్లో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుంటారని చెప్పారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్యలో ప్రవేశానికి పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సూపరెంటెండెంట్ ధర్మరాజు

సీతానగరం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశానికి ప్రవేశపరీక్ష జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో ఆదివారం జరిగింది.ఈ మేరకు పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ ధర్మరాజు డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు గణపతినాయుడు మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియ ల్ పాఠశాలల్లో ప్రవేశానికి 227 మంది విద్యార్థులకు సీట్లు ఉండగా 209 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలియజేశారు.

101 మందికి సామూహిక ఉపనయనం



ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక ఉపనయన కార్యక్రమం

సాలూరు: పట్టణంలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో సామూహిక ఉపనయన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. శాస్త్రోక్తంగా ఉపనయన కార్యక్రమాలను నిర్వహించి 101 మందికి ఉపనయనం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మికి ఫర్నిచర్‌ను అప్పగిస్తున్న పూర్వ విద్యార్థులు

సీతానగరం: సీతానగరం ఉన్నత పాఠశాలలో తరగతి గదుల్లో విద్యాబోధనకు అవసరమైన ఫర్నిచర్‌ను పూర్వ (1999 టెన్త్)విద్యార్థులు హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మికి అందజేశారు. ఈ మేరకు హెచ్‌ఎం మాట్లాడుతూ 1999 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించి వివిధ స్థాయిల్లో ఉద్యోగాల్లో స్థిరపడడంతో వారంతా ఉదారమైన మనస్సుతో రూ. 25 వేలతో కొనుగోలు చేసిన విద్యాబోధనకు ఉపయోగ పడే టేబుల్స్‌ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న పూర్వ విద్యార్థి ఎస్.రవికుమార్ మాట్లాడుతూ సహచర విద్యార్థులతో సర్చించి వారి అనుమతితో ఫర్నిచర్ కొనుగోలు చేసి హెచ్‌ఎంకు అప్పగించామన్నారు.

భారీ వాహనాలతో తప్పని అవస్థలు



కొద్దిరోజుల కిందట గడిగుడ్డి సమీపంలో వద్ద నిలిచిపోయిన వాహనాలు

సీతంపేట: పాలకొండ-హడ్డుబంగి రహదారిలో ఎక్కువగా ఇటీవల కాలంలో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. అవి అప్పుడప్పుడు తరుచూ మరమ్మతులకు గురై ఆగిపోతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రెండు రోజుల కిందట గొయిది మలుపు వద్ద భారీ లారీ మరమ్మతుల బారిన పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. అంతకుముందు గడిగుడ్డి సమీపంలో..కంబగూడ వద్ద ఇలా ఎక్కడబడితే అక్కడే వాహనాలు నిలిచిపోతున్నాయి. వాటి ప్రభావంతో రోడ్లు కూడా అనతికాలంలోనే పాడవుతున్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఎన్‌హెచ్ 5 గుండా వెళ్లాల్సిన భారీ వాహనాలు దూరం కలిసివస్తుందని షార్ట్‌కట్‌లో భాగంగా ఈ దారి గుండా వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.



గొయిది మలుపు వద్ద నిలిచిపోయిన భారీ లారీ

టేకు కలప అక్రమ రవాణా

భామిని: మండలంలో టేకు కలప అక్రమ రవాణా జోరందుకుంది. గురండి గ్రామంలో విలువైన టేకు కలపను బత్తిలికి చెందిన కలప అక్రమ రవాణాదారులు శనివారం సాయంత్రం నరికి వేసి రాత్రికి రాత్రి తరలించారు.

విలువైన టేకు కలప రవాణాకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకు పోయారని స్థానికులు తెలిపారు.

పప్పన్నం కరువాయె..!

పార్వతీపురం రూరల్: సామాన్య, మధ్య తరగతి వారు పప్పన్నం తిందామన్న ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో బయట మార్కెట్‌లో కొనుగోలు చేయలేక వారంతా పప్పన్న కూడా తినలేని పరిస్థితి నెలకొంది. గడిచిన ఐదు నెలల నుంచి రేషన్ దుకాణాల ద్వారా పూర్తిస్థాయిలో కందిపప్పు సరఫరా చేయకపోవడంతో ఆయా వర్గాల వారు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయలేకపోతున్నారు. పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తినాలని ప్రభుత్వం నిత్యం ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో సరఫరా చేయకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మార్చిలో కూడా లేనట్టే

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై మార్చి నెలకు సంబంధించి కూడా కూటమి ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయకుండా చేతులెత్తేసింది. కేవలం బియ్యం సరఫరా చేసి చేతులు దులుపుకుంది. పంచదార, కందిపప్పు, గోదుమపిండి ప్రతి నెలా బియ్యంతోపాటు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకుండా కేవలం బియ్యం సరఫరాకే రేషన్ షాపులు పరిమితమవుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు ప్రజలకు పంపిణీ చేస్తామని మాట ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత అరకొర సరుకులతోనే చేతులు దులిపేసుకుంటున్నారు. జనవరి నెలలో పార్వతీపురం మండలానికి సంబంధించి రేషన్ కార్డు దారులకు 60శాతం మాత్రమే కందిపప్పు పంపిణీ చేసినా మార్చి నెల వచ్చేసరికి మండలంలో కందిపప్పు పంపిణీకి పూర్తిగా ఎగనామం పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.



చినబొండపల్లిలో ఎండీఎం వాహనం ద్వారా బియ్యం సరఫరా

నిల్వలు వచ్చాకే సరఫరా

పౌరసరఫరాల శాఖ నుంచి పప్పు జిల్లాకు కేటాయిస్తే వినియోగ దారులకు చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తాం. జనవరిలో 60శాతం కందిపప్పును ప్రభుత్వం విడుదల చేయగా ఆ మేరకు రేషన్ దుకాణాలకు కందిపప్పును సరఫరా చేశాం.

– ఎం.రాజేంద్ర, సీఎస్‌డీటీ, పార్వతీపురం

ప్రతి నెలా సరఫరా చేయాలి



రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు కంది పప్పు, పంచదార, గోధుమ పిండి తదితర వస్తువులు ప్రతి నెలా సరఫరా చేయాలి. కేవలం బియ్యం సరఫరా చేసి మిగిలిన వస్తువులు ఎప్పుడు సరఫరా చేస్తారో కూడా తెలియడం లేదు. ఒక్కోసారి బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార అందజేస్తామని డీలర్లు చెప్పినప్పటికీ ముందస్తు సమాచారం లేకపోవడంతో డబ్బులు దగ్గర ఉంచుకోకపోవడంతో సరుకులను విడిపించుకోలేకపోతున్నాం. ప్రతి నెలా సరుకులను క్రమం తప్పకుండా అందజేస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

– జక్కు రమణమ్మ, లక్ష్మీనారాయణపురం, పార్వతీపురం మండలం

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం ప్రారంభం

భామిని: మండలంలోని పాత ఘనసర రైతుల సౌకర్యార్థం పక్కా రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. పాత ఘనసర గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం నుంచి వంశధార నదికి పంటపొలాల్లో ప్రయాణించే మట్టి రోడ్డు పక్కా సీసీ రోడ్డుగా కార్యరూపం దాల్చనుంది. సుమారు 1.5 కిలోమీటర్ల రోడ్డును సుమారు రూ.5లక్షలతో నిర్మాణం చేపట్టారు. గతంలో పాలకొండ శాసనసభ్యురాలిగా విశ్వాసరాయి కళావతి పాత ఘనసర వద్ద ఏనుగుల పంట విధ్వంసం చూడడానికి వెళ్లిన సమయంలో స్థానిక రైతులు రోడ్డు సమస్యపై వివరించారు. గతంలో ఇదే ప్రాంతంలో ఏనుగుల దాడిలో తాలాడకు చెందిన రైతు మృత్యువాత పడిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల కోరిక మన్నించి రోడ్డును ఆమె ప్రతిపాదించిన తరువాత ఎన్నికల కోడ్ రావడంతో నిధులు ఖర్చు కాలేదు. ప్రస్తుతం అదే పక్కా రోడ్డు కార్యరూపం దాల్చడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెవి పోగు వల్ల యజమానికి చేరిన గేదె

బలిజిపేట: తప్పిపోయిన గేదె చెవికి ఉన్న పోగువల్ల అసలు యజమానికి రూ.80వేల విలువ కలిగిన గేదెను అప్పగించినట్లు మండల పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎక్కడి నుంచో తప్పిపోయి వచ్చిన గేదెను బర్లిగ్రామానికి చెందిన దేబార్కి శ్రీరాములు అనే రైతు తన షెడ్‌లో కట్టి ఉంచాడు. ఈ విషయం మండల పశువైద్యాధికారి గణేష్‌కు తెలియచేయగా చెవికి ఉన్న పోగు సంఖ్యను చూసి డిపార్ట్‌మెంట్ యాప్‌లో పరిశీలించగా సీతానగరం మండలం బూర్జ గ్రామానికి చెందిన దత్తి రామకృష్ణది ఆ గేదె అని తెలియడంతో వారికి అప్పగించారు. దీనికి గేదె యజమాని సంతృప్తి చెంది వైద్యాధికారి గణేష్, శ్రీరాములు నిజాయితీకి అభినందనలు తెలిపాడు.

మెగా వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ మూలిగూడ జంక్షన్ వద్ద ఆదివారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో యస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్‌గౌస్ మరియు బియ్యాలవలస సర్పంచ్ పువ్వల అజారీ సంయుక్త సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరానికి మంత్రజోల, దురుబిలి, రంగుపురం, కుసాబడి, షేకుపాడు, గుజ్జుపాడు గ్రామాల నుంచి వచ్చిన 120 మందికి కురుపాం, రేగిడి, దుడ్డుఖల్లు పీహెచ్‌సీల వైద్యులు శంకరరావు, స్వాతి, సుకృత వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



ఏకలవ్య పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 2025 – 26లో ఆరో తరగతిలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కలవ్య పాఠశాలతో పాటు భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగింది. ఏకలవ్య పాఠశాల కేంద్రంలో పరీక్షకు 394 మంది విద్యార్థులను పరీక్షకు కేటాయించగా 12 మంది గైర్హాజరవ్వగా 382 మంది హాజరైనట్లు ఏటీడబ్ల్యూఓ. బి.సురేష్ కుమార్ తెలిపారు. భద్రగిరి గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రానికి 136 మందిని కేటాయించగా 8 మంది గైర్హజరవ్వగా 128 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ కె.సురేష్ తెలిపారు.

కొత్త నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: కొత్తగా వచ్చిన మోటార్ అండ్ వెహికల్స్ చట్టం నిబంధనలు ఆటో డ్రైవర్లు విధిగా పాటించాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలో ఉన్న ఆటో డ్రైవర్లందరితో సమావేశం నిర్వహించి కొత్త నిబంధనలను వివరించారు.పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ప్రయాణ సమయంలో లౌడ్ స్పీకర్లతో అధిక సౌండ్ పెట్టవద్దని, సురక్షిత ప్రయాణాలు చేయాలని సూచించారు.

నేడు క్రాష్ కార్యక్రమం ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు క్రాష్ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతుల నిమిత్తం ఇప్పటికే సుమారు రూ.3లక్షలతో సామగ్రి కొనుగోలు చేసినట్టు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఈ కార్యక్రమం ద్వారా తగు చర్యలు చేపడతామని తెలిపారు.

ఆహారమే దివ్య ఔషధం

- ఆరోగ్యనియమాలతో సంపూర్ణ ఆరోగ్యం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

పార్వతీపురం:

వాతావరణం మారుతున్న సమయంలో ఆహారం తీసుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. వేసవికాలం , వర్షాకాలం, శీతాకాలం ఇలా కాలాలు మారుతున్నప్పుడు మనుషులు రోగాల బారిన పడడం సహజంగా వస్తుంది. వాతావరణంలో మార్పు వచ్చినప్పుడు మనిషిలో ఉన్న అంతర్గత రోగాలు బయట పడుతుంటాయి. ఇది అందరిలో జరుగుతున్నప్పటికీ ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వాతావరణం మారినప్పుడు తరచూ అనారోగ్యానికి గురవుతుంటారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకు కూరలు తినే వారు కాలాలు మారినా వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు చిన్నపాటి వ్యాయామం చేస్తే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న తాజాకూరగాయలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాజా కూరగాయలు, పండ్లు ప్రతి నిత్యం ఆహారపు అలవాటుగా మార్చుకోవాలి. తీపి పదార్థాలు తక్కువగా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆహారంలో నిత్యం పప్పు ధాన్యాలు, వేరుశనగ, మినుములు, శనగలు, బాదం, కందిపప్పు తోపాటు ఆకు కూరలు తీసుకోవాలి. మార్కెట్‌లో సరసమైన ధరలలో లభించే జామ, నిమ్మ, ఉసిరి వంటి వాటిని ఏదో ఒకదానిని నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రతిరోజూ ఒక గుడ్డు తీసుకోవడంవల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, కార్బొహైడ్రేడ్స్‌ను తగు మోతాదులో తీసుకోవాలి. బయట మార్కెట్‌లో ఆకర్షణీయంగా కనిపించే పిజ్జాలు, బర్గర్‌లు వంటి జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండడం మంచిది. జంక్‌ఫుడ్స్ తింటే జీర్ణకోశవ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి

రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లును అలవర్చుకోవాలి. తాజా కూరగాయలను, ఆకుకూరలను తినాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తింటే ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆహారం ఒకేసారి కాకుండా ప్రతి మూడు గంటలకు ఒకసారి తినడంవల్ల జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది.

ఆహారాన్ని ఔషధంలా తీసుకోవాలి



ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారాన్ని ఔషధంలా తీసుకోవాలి. బయట మార్కెట్‌లో దొరికే రుచికరమైన బిర్యానీలు, ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకుంటే జీర్ణక్రియ దెబ్బతిని రోగాలబారిన పడతారు. ప్రస్తుతం బయట లభిస్తున్న ఆహారపదార్థాలను తీసుకోవడంవల్లే రోగాలు వస్తున్నాయి. శాకాహారమైనా, మాంసాహారమైన ఇంట్లో తయారు చేసుకుంటే మంచిది. జీవించినంత కాలం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారపు అలవాట్లు క్రమం తప్పకుండా ఉండాలి.

–డా.ఎస్ఎంకె.తిరుమల ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బందలుప్పి



విక్రయానికి సిద్ధంగా పప్పుదినుసులు

బాబూ.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేయవద్దు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరినీ సమానంగా చూడాల్సింది పోయి ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా మాట్లాడడం రాజ్యాంగాన్ని అపహా స్యం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని గుచ్చిమి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముని మన్మథరావు నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం హాజరైన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడారు. రాగద్వేషాలను, స్వప్రయోజనాలను విడనాడి, రాజ్యాంగ బద్ధంగా రాష్ట్ర ప్రజలందరికీ సేవలందిస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి న విషయాన్ని మరిచి గంగాధర్ నెల్లూరులో సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఇస్తే 'పాములకు పాలు పోసినట్లేనని అనడం' ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వైఎస్ ఆర్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అండగా కోటి 40లక్షలకు పైగా ప్రజానీకం ఉన్నారన్నారు. వారందరికీ ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వొద్ద ని చంద్రబాబు చెప్పడం ఏహ్యమైన చర్య అని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, కార్యదర్శి బంకురు శంకరరావు, అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ ఎం.శ్రీదేవి, జెడ్పీటీసీ ఎం, బాబ్జీ, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పరామర్శ



సోమయాజులును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎంపీటీసీ సోమయాజులను మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం కురుపాంలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. సోమయాజులు కుమారుడు సోమనాథ్ ఇటీవల మృతి చెందాడు. విషయంత తెలుసుకున్న వీరు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.వారి వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, వైస్ సర్పంచ్ ఆదిల్, పార్టీ అధికార ప్రతినిది శెట్టినాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస రూరల్: చినమేరంగి గ్రామానికి చెందిన మీసాల రంగ, భోగాపురం నాగయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట అల్లు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.